క్లుప్తంగా

క్రీడా పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

రుద్రంగి: కరీంనగర్, హకీంపేట, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి పాసై నాలుగో తరగతిలో అడ్మిషన్ పొందే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఎంపిక ప్రక్రియ మూడ దశల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉంటుందన్నారు. అనంతరం మూడు క్రీడా పాఠశాల్లో అర్హతను బట్టి ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపిక పోటీలు జూన్ 21 నుంచి 25 వరకు నిర్వహించనున్నారని, మరిన్ని విద్యార్థులు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం రహీం ఖాన్‌పేటలోని మోడల్ పాఠశాలలో హావర్లీ బేసిస్ టీజీటీ సోషల్ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (సోషల్), బీకాం తోపాటు డీఈడీ, బీఈడీ అర్హత కలిగినవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ, డెమో క్లాస్ ద్వారా ఎంపిక ఉంటుందని, ఈనెల 21న ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్స్, డ్రెస్సులు అందజేత


గంగాజల, సౌజన్యకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలు

వేములవాడ: వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన చిత్తారి గంగాజల, చిత్తారి సౌజన్యకు గత నాలుగేళ్లుగా పట్టణంలోని ఉర్దూమీడియం స్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న సుహాసిని, చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన వొజ్జల ప్రణీత ఏటా స్టేషనరీ, స్టడీ మెటీరియల్, తలా రెండు సివిల్ డ్రెస్సులు అందజేస్తున్నారు. ప్రస్తుతం మర్రిపల్లి కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న గంగాజల, సౌజన్యను వేములవాడలోని సుహాసిని నివాసంలో సౌజన్య తల్లి రేణుక చేతుల మీదుగా వారికి ఆదివారం అందజేశారు. గంగాజలకు తండ్రి లేకపోవడంతో తల్లి ఎల్లవ్వ కూలీ పని చేసుకుంటూ వీరిని పోషిస్తుందనీ, సౌజన్య తల్లిదండ్రులు రేణుక- చిన్నదుర్గయ్య రోజువారీ కూలీలని హెచ్‌ఎం సుహాసిని తెలిపారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



బోయినపల్లి: మండలంలోని కొదురుపాక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు కల్యాణంలో పాల్గొని ఒడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు మర్రిపల్లి వేణుగోపాలచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ అందజేత

కోనరావుపేట: చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చిన్నారులు తమవంతు సాయం అందించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు చదువుకున్న చిన్నారులు పాఠశాల కోసం సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తమ వంతుగా అందించినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పురాతన శివాలయంలో ఉన్న ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోగా దానిస్థానంలో మార్బుల్ రాతితో ఏర్పాటుకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆదివారం పరిశీలించారు. ధ్వజ స్తంభం కూలిపోయే పరిస్థితిలో ఉంది. దీంతో గ్రామస్తులు, కమిటీ సభ్యులు సమావేశమై నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాతి స్తంభం చుట్టూ నాలుగు శివుడికి కి సంబంధించి దేవుళ్ల విగ్రహాలు చెక్కాలని నిర్ణయించారు. కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ గౌరవ సలహాదారు నంది కిషన్, సభ్యులు బొమ్మకంటి శ్రీనివాస్, అర్చకులు రాచర్ల హన్మండ్లు శర్మ, బండారి బాల్‌రెడ్డి, రవి, గోపాల్, సురేశ్ తదితరులున్నారు.

పంటలు పండేనా ?

- వర్షాధారిత పంటలకు వాతావరణ ముప్పు
- సరైన వర్షపాతం నమోదుకాని తీరు
- అధిక ఉష్ణోగ్రతలతో పంటలకు దెబ్బ
- వానాకాలం సాధారణ సాగు 27,200 ఎకరాలు
- కంది, మొక్కజొన్న సాగుకు రైతుల విముఖత


ముస్తాబాద్‌లో గతేడాది పత్తి వేసి వదిలేసిన చేను

ముస్తాబాద్: వర్షాధారిత పంటలకు వాతవరణం పెనుముప్పుగా మారింది. ఈ సీజన్‌లో పునాస పంటల సాగుకు రైతులు సమాయత్తం కావడం లేదు. సరైన వర్షాలు లేక ఏరువాక సాగడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ముస్తాబాద్ మండలంలో అధిక ఉష్ణోగ్రతలకు తోడు సాధారణ వర్షపాతం కూడా నమోదుకాకపోవడంతో ఇప్పటి వరకు ఆరుతడి, వర్షాధారిత పంటలు వేసేందుకు రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. మృగశిరకార్తెతో వర్షాలు కురుస్తాయని భావించిన రైతులు.. దుక్కులు దున్నేందుకు సిద్ధయ్యారు. కానీ జూన్ 11 నాటికి కేవలం 23 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ 11 నాటికి 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 27 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు కనిపిస్తోంది.

వర్షాధారిత పంటలకు ఎసరు

ముస్తాబాద్ మండలంలో 27,200 ఎకరాలలో వానాకాలం పంటల సాధారణ విస్తీర్ణం. ఇందులో కంది పంట 600 ఎకరాలు, మొక్కజొన్న 200 ఎకరాలు, 300 ఎకరాలలో పత్తి సాగుచేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కనీస వర్షపాతం నమోదుకాకపోవడానికి తోడు మండుతున్న ఎండలు, అధిక ఉష్ణోగ్రతలతో రైతులు వెయ్యి ఎకరాలను బీడుగానే ఉంచారు. కంది, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేసేందుకు భయపడుతున్నారు. వాతావరణంలో కనీసం తేమశాతం లేకపోవడమే ఇందుకు కారణమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో కనీసం ఒక్కరోజైన 5 మిల్లీమీటర్ల వర్షం ఇప్పటి వరకు కురవలేదని అధికారులు పేర్కొన్నారు. కురిసిన 23 మిల్లీమీటర్ల వర్షపాతం కూడా పది రోజుల వ్యవధిలోనే నమోదైందని చెబుతున్నారు.

అంతటా వరిపంట

ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్, గూడెం, కొండాపూర్, నామాపూర్, పోతుగల్, ముస్తాబాద్‌లలో వరి పంటనే రైతులు సాగుచేస్తున్నారు. మద్దికుంట, మోహినికుంట, చీకోడు, బందనకల్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో వర్షాధారిత కంది, మొక్కజొన్న, పత్తిపంటలను సాగుచేస్తారు. ఇప్పటి వరకు సాధారణ వర్షం కూడా నమోదుకాకపోవడంతో భూములను బీళ్లుగా వదిలిన పరిస్థితి కనిపిస్తోంది. మండలంలో 26,200 ఎకరాలలో వరి సాగుచేస్తున్నారు. బోరుబావులు, ఎగువమానేరు ప్రాజెక్టు కింద వరిపంటను సాగుచేయడం కనిపిస్తుంది.

వరి సాగుచేస్తున్నాం



మక్క, పత్తి పంటలను వేయడం మానేశాం. ఇప్పుడు వరిపంటలే అధికంగా సాగుచేస్తున్నాం. మృగశిర, ఆరుద్ర కార్తెలలో సరైన వానలు కురవడం లేదు. దీంతో అందరూ బోర్ల కింద వరిపంటనే సాగుచేస్తున్నారు.

– కుంబాల రాజిరెడ్డి, ముస్తాబాద్

వానలు లేక పత్తి వేయలే



ఏటా మొక్కజొన్న, పత్తిపంట సాగుచేశాం. ఈసారి ఈ కార్తెలో ఇప్పటికీ సరైన వానలు పడలేదు. వాతావరణం వేడిగానే ఉంది. ఎకరంన్నర భూమిలో పత్తి వేద్దామనుకుని వద్దనుకున్న.

– జనగామ శ్రీనివాస్, ముస్తాబాద్

గాలిలో తేమశాతం లేదు



వర్షాధారిత పంటలు వేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఉష్ణోగ్రతలు తగ్గలేదు. మొక్కజొన్న, పత్తి, కంది పంటలు వేసేందుకు రైతులు భయపడుతున్నారు. అందరు వరిసాగుకు మొగ్గుచూపుతున్నారు.

– వెంకటేశ్, ముస్తాబాద్, ఏవో

ఉచిత నోట్ బుక్స్ పంపిణీ



వేములవాడ: హైదరాబాద్ పట్టణం అలియబాద్‌లోని మున్నూరుకాపు సంఘం ఆవరణలో పాతనగర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నోట్స్‌బుక్స్ పంపిణీ, మెరిట్ స్టూడెంట్స్‌కు క్యాష్ అవార్డ్స్ కార్యక్రమంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం సంఘ సభ్యులు ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

ఫొటో గ్రాఫర్ల నిరసన


నిరసన తెలుపుతున్న ఫొటోగ్రాఫర్లు

వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మొబైల్‌లో ఫొటో తీయడం మా వృత్తి కాదు అని చెప్పినందుకు ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దానే వేణు, మహంకాలి బాబు, నాగరాజు, ప్రభాకర్, శ్రీకాంత్, సందీప్ తదితరులు ఉన్నారు.

కంపోస్ట్ షెడ్డులోనే పార్కింగ్..



చందుర్తి: మండలంలోని కొత్తపేట గ్రామంలో కంపోస్టు షెడ్ వినియోగంలో లేకపోవడంతో గ్రామస్తులు ద్విచక్రవాహనాలను అందులోనే పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు కంపోస్ట్ షెడ్‌లోవర్మీ కంపోస్టు తయారు చేస్తున్నామని గొప్పలు చెప్పకోవడం ఉత్తమాటేనని చెపేందుకు ఇదే నిదర్శనం. ఇప్పటికైనా కంపోస్ట్ షెడ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్‌వోసీ అందజేత

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన ముద్రకోళ కావ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50 లక్షలు మంజూరుకాగా బాధిత కుటుంబానికి శనివారం రాత్రి తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే.మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని పర్యావరణ పరిరక్షకుడు, సామాజిక కార్యకర్త దుంపెన రమేశ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన తన సొంత ఖర్చులతో మొక్కలు కొనుగోలు చేసి ఇంటింటా పంపిణీ చేశారు. జామ, దానిమ్మ, మల్లె, గులాబీ, వేప, గన్నేరు, మైదాకు, మునిగ రకాల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తమ ఇంటి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, వివిధ గ్రామాల నుంచి వచ్చి మొక్కలు తీసుకెళ్లాలని కోరారు.

సహకారానికి దూరం

- చందుర్తి సింగిల్‌విండో సొసైటీకి ఇప్పటికీ సరఫరా కాని విత్తనాలు, ఎరువులు
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తూ అధిక ధరలకు కొనుగోలు
- సింగిల్‌విండోలో అవకతవకలు జరిగాయని పలువురి ఆరోపణలు


సొసైటీలో విచారణ చేస్తున్న జిల్లా సహకార అధికారి (ఫైల్)

చందుర్తి: రైతులకు సహకారం అందిస్తూ అండగా నిలవాల్సిన సింగిల్‌విండో సొసైటీ అక్రమాలకు అడ్డాగా మారిందిని గతేడాదిగా పాలకవర్గ సభ్యుల మధ్య వివాదం తలెత్తింది. ఇప్పటికీ అదే తంతు కొనసాగుతుండడంతో రైతులకు సహకారం అందకుండా పోతుందని వారు వాపోతున్నారు. గతంలో పంట సీజన్ ప్రారంభంకావడంతోనే అందుబాటులో వరి విత్తనాలతో పాటు ఆరుతడి, తదితర విత్తనాలు అందుబాటులో ఉంచే సొసైటీలో ప్రస్తుతం అవి ఏమీ లభించకపోవడంతో సొసైటీ నిధుల్లో అవకతవకలు జరగడమే కారణమని సొసైటీ పరిధిలోని రైతులు ఆరోపిస్తున్నారు.

ఎరువుల బస్తాల సొమ్ములో గోల్‌మాల్

సింగిల్‌విండో పరిధిలోని రైతులకు ఎరువుల బస్తాలు అందించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా జరిగింది. సొసైటీలో డైరెక్టర్లు తమ గ్రామాల పరిధిలోని గోదాముల్లో బస్తాలు దింపుకొని విక్రయించారు. విక్రయించిన సొమ్ము రూ.6.53 లక్షలను కొందరు డైరెక్టర్లు తమవద్ద పెట్టుకుని సొసైటీకి చెల్లించేందుకు ఏడాదిగా ఇబ్బంది పెట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. చివరకు జిల్లా సహకార సంఘం అధికారి రెండుసార్లు డబ్బులు వాడుకున్న డైరెక్టర్లకు నోటీసులు ఇస్తే ఎరువుల బస్తాల సొమ్మును చెల్లించారు. కానీ ఈ సొమ్ములో ఓ డైరెక్టర్ రూ.80వేలు చెల్లించకున్నా, చెల్లించాడని ఆడిట్ క్లియరెన్స్ చేయించుకున్నారని పాలకవర్గంలోని డైరెక్టర్లు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గతంలో ఎరువుల బస్తాల్లో అక్రమాలు జరిగాయని రెండేళ్ల క్రితమే బస్తాలను సీజ్ చేశారు.

జీలుగ బస్తాలకే పరిమితం

మండల సహకార సొసైటీ ఏటా రైతులకు అన్ని విత్తనాలతో పాటు ఎరువు బస్తాలను అందుబాటులో ఉంచాలి. ఈ సీజన్‌లో 400 జీలుగ బస్తాలను తెప్పించి, విత్తనాలు, ఎరువులను తెప్పించకుండా ముఖం చాటేశారన్న ఆరోపణలున్నాయి. కాగా ఈ సంఘం పరిధిలోని రైతులు ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతుండగా ఎరువుల బస్తాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో అధిక ధరలకు ఎరువుల బస్తాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ప్రైవేట్ వ్యాపారులకు వత్తాసు

సొసైటీ అభివృద్ధికి పనిచేయాల్సిన కొందరు డైరెక్టర్లు ప్రైవేట్ వ్యాపారుల వైపు మొగ్గుచూపుతూ సొసైటీ ఆదాయానికి గండి కొడుతున్నారని పాలకవర్గంలో కొందరు డైరెక్టర్లు విమర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో కూడా ప్రైవేట్ వ్యాపారులు సగానికిపైగా కొనుగోలు చేసిన తర్వాతే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని పాలకవర్గ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ప్రైవేట్ వ్యాపారి వద్ద కొనుగోలు



పత్తి విత్తనాలు మొలకెత్తాయి. వరి నాట్లు వేసేందుకు దక్కులు సిద్ధం చేసుకుంటున్నాం. సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా సొసైటీలో మందు బస్తాలు రాకపోవడంతో ప్రైవేటు వ్యాపారి వద్ద కొనుగోలు చేశాం. ఏటా సొసైటీలోనే ఎరువుల బస్తాలు కొనుగోలు చేసేటోన్ని. ఈ ఏడాది ఇంకా రాలేదు.

– మర్రి మల్లేశం, రైతు, చందుర్తి

ఆదాయ వ్యయాలు చూపించాలి



సింగిల్‌విండో సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు సొసైటీ పరిధిలోని రైతులతో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయలేదు. గతేడాది నుంచి పాలకవర్గ సభ్యుల మధ్య అక్రమాలు జరుగుతున్నాయని గొడవలు జరుగుతున్నాయి. సొసైటీకి సంబంధించి ఆదాయం, ఖర్చుల వివరాలు తెలపాలి.

– పులి సత్తయ్య, రైతు, చందుర్తి

త్వరలోనే తెప్పిస్తాం



సీజన్ ప్రారంభంలో నే 400 జీలుగ బస్తాలు తెప్పించి అందజేశాం. వరి విత్తనాలకు మార్కెట్‌లో కన్నా మాకు సరఫరా చేసే సీడ్‌లో ధ ర ఎక్కువ ఉండడంతో గతేడా ది ఎక్కువ కొనుగోలు చేయకపోగా తిరిగి పంపించాం. ఎరువు బస్తాల సొమ్ము వాడుకున్న డైరెక్టర్ల ంతా డబ్బులు చెల్లించారు. త్వరలో ఎరువుల బస్తాలు తెప్పిస్తా.

– గంగారెడ్డి, సీఈవో సింగిల్ విండో, చందుర్తి

క్రీడలతో స్నేహభావం పెంపు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై శేఖర్‌రెడ్డి

ముస్తాబాద్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతుగల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్‌లో గన్నెవారిపల్లె, పోతుగల్ బ్రదర్స్ జట్లు తలపడగా, పోతుగల్ బ్రదర్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు వచ్చిన రూ.5వేల ప్రైజ్ నగదును పోతుగల్‌కు చెందిన పేద విద్యార్థిని శ్రీజ కంప్యూటర్ విద్యకు అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు వుచ్చిడి బాల్‌రెడ్డి తనవంతుగా శ్రీజకు రూ.2వేల నగదును అందించాడు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూత్ ఆర్గనైజర్లు కిట్టు, రాకేశ్, సాయి, భరత్, నిశాంత్, వినయ్, అబి, మహేశ్, కోల కృష్ణ, గుండెల్లి శ్రీను, గజ్జెల రాజు, జనార్దన్, భాను, నాని, తిరుపతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పోచమ్మ బోనాలు

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి, కొదురుపాక గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. దప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి చెల్లించుకున్నారు. పిల్లా పాపలను చల్లంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుకు మరమ్మతు

సాక్షి స్పందన



కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకుకు మరమ్మతు చేపట్టారు. 'ఎప్పుడు కూలుతుందో ఏమో..' అన్న శీర్షికతో మే 18న సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జనావాసాల మధ్య ఉన్న ఈ వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉందని రావడంతో గ్రామ కార్యదర్శి కవితారెడ్డి ఆధ్వర్యంలో వాటర్‌ట్యాంకుకు మరమ్మతులు చేపట్టారు. పెచ్చులూడుతున్న చోట సిమెంట్‌తో బాగు చేయించి, రంగులు వేయించారు.

నూతన కమిటీల ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో శ్రీ సీతారామచంద్రస్వామి, శివాలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలకు నూతన కార్యవర్గ కమిటీలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తులు సమావేశమై నూతన ఆలయ కమిటీలను ఏర్పాటు చేశారు. రామాలయం చైర్మన్‌గా మోతే లక్ష్మారెడ్డి, సభ్యులుగా నల్ల పర్శరాములు, తోపుచర్ల నారాయణరావు, దొమ్మాటి రాజయ్య, కంచర్ల ప్రకాశ్, శివాలయం చైర్మన్‌గా బొల్లం సత్యనారాయణ, సభ్యులుగా ఎలవేరని లింగం, పంతంగి రాజయ్య, దరిపెల్లి కిషన్, అవదూత మహేశ్, ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా లద్దునూరి హన్మాండ్లు, సభ్యులుగా గరిపెల్లి రమేశ్, ఆకారం రాజు, ఫిన్నోజు శ్రీధర్, సీతాల ఆంజయ్యను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా సూర నర్సయ్య, నిమ్మ నారాయణరెడ్డి, దొమ్మాటి నర్సయ్యను ఎన్నుకున్నారు.

పాలకేంద్రం చైర్మన్‌గా లక్ష్మారెడ్డి


లక్ష్మారెడ్డి

కోనరావుపేట: మండలంలోని కనగర్తి పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా జిల్లెల్ల లక్ష్మారెడ్డి మూడోసారి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా మోతె రాజిరెడ్డి, మారుపాక చంద్రయ్య, రావులపెల్లి పెద్ద మహిపాల్‌రెడ్డి, ఎల్లె ప్రభాకర్, జాప పర్శరాములు, మారుపాక రాజయ్య, రావులపెల్లి చిన్న మహిపాల్‌రెడ్డి, అండెం రాములు, ఏరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజిరెడ్డి, టెస్టర్ రావులపెల్లి వెంకట్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు


పూజలు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు, కుల సంఘాల నాయకులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లా జెల్లాను సల్లంగా చూడాలని కోరారు. మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు పూజలు చేశారు. వన భోజనాలకు వెళ్లి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నంది కిషన్, పట్టణ అధ్యక్షుడు బాధ రమేశ్, జిల్లా ప్రచార కార్యదర్శి బండారి బాల్‌రెడ్డి, నాయకులు మీసం రాజం, రవి, పర్శరాములు, కిరణ్, రాజు, మోహన్, దేవయ్య, మేగి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగిలో వర్షం

రుద్రంగి: మండలకేంద్రంలోఆదివారం మోస్తరు వర్షం కురిసింది. వానాకాలం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా అంతంత మాత్రంగానే వర్షాలు కురవడంతో పంటల సాగుకు ఎదురుచూస్తున్న అన్నదాతలు ఆదివారం కురిసిన వర్షం సాగుకు అనుకూలమని హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం

కోనరావుపేట: మండలంలోని సుద్దాల గ్రామ అంబేద్కర్ (మాల) సంఘం నూతన అధ్యక్షుడిగా ఎరవెల్లి రాజయ్య ఎన్నికయ్యారు. ఆదివారం సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎగదండి రవీందర్, కార్యదర్శిగా మహిపాల్, కార్యవర్గ సభ్యులుగా మురళి, కిషన్, నాగరాజ్, జగన్, తిరుపతి, రాజు ఎన్నికయ్యారు.


వేములవాడ అర్బన్: ఎన్నికైన కార్యవర్గం

వేములవాడఅర్బన్: పట్టణ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారాటి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా గాజుల వజ్రవ్వ, కార్యదర్శిగా మల్లేశం, సహాయకార్యదర్శిగా హరీశ్, నర్సవ్వ, భూమవ్వ, కోశాధికారిగా దుర్గయ్య, సభ్యులుగా నరేశ్, కనకవ్వ, మల్లేశ్వరి, గట్టవ్వ, మంగ, భారతవ్వ, అంజికుమార్, భారతి, నారాయణ, చంద్రయ్య, కమల, దేవమ్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు, జిల్లా అధ్యక్షుడు వేణు, అనసూర్య తదితరులున్నారు.

ఫాదర్స్ డే వేడుకలు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమం నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్ వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.